అదిగదిగో ఆశల రైలు..



కొత్తపల్లి-మనోహరాబాద్ నూతన రైల్వేలైన్‌లో భాగంగా ఆదివారం జిల్లా సరిహద్దు వరకు రైలు ట్రయల్‌రన్ నిర్వహించారు. సిద్దిపేట జిల్లా నుంచి గంగాపూర్, విఠలాపూర్ గ్రామాల మధ్య ఉన్న బ్రిడ్జి వరకు ట్రయల్ రన్ విజయవంతమైంది. మరి కొద్దిరోజుల్లోనే జిల్లాకు రైలు వస్తుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, తంగళ్లపల్లి**



బస్టాండు కిటకిట.. బస్సుల్లేక కటకట

వేములవాడ : ఆధ్యాత్మిక పట్టణమైన వేములవాడ ఆర్టీసీ బస్టాండ్ ఆదివారం కిక్కిరిసింది. రాఖీ పౌర్ణమి సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి స్వస్థలాలకు వచ్చినవారు తిరుగు పయనమయ్యారు. దీంతో వేలాది మంది జనంతో బస్టాండు కిటకిటలాడింది. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్లాట్‌ఫాంల వద్ద రద్దీ తీవ్రంగా ఉంది. రద్దీకి అనుగుణంగా బస్సులు లేకపోవడంతో తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

ఈనాడు
రాజన్న సిరిసిల్ల

దుకాణాల్లో గోలీమాల్

- ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయాలు
- ఆచూకీ లేని ఔషధ నియంత్రణ శాఖ

వేములవాడకు చెందిన ఓ యువకుడు ఇటీవల సిరిసిల్లలోని ఒక ఔషధ దుకాణంలో గర్భస్రావం మాత్రలు కొనుగోలు చేశాడు. అది తీసుకున్న యువతి గర్భస్రావంతో పాటు ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లింది. డీఎంహెచ్‌వో కేసు నమోదు చేసి, దుకాణాన్ని సీజ్ చేశారు. ఇది వెలుగులోకి వచ్చిన సంఘటన మాత్రమే. బయటపడని ఉదంతాలు చాలానే ఉన్నాయి.

జిల్లాలోని ఔషధ దుకాణాల్లో నెలకు రూ.కోట్ల వ్యాపారం జరుగుతోంది. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా షెడ్యూల్ హెచ్, హెచ్1 మందులను అమ్మడానికి వీల్లేదు.. ఆ మేరకు రికార్డులు కూడా నిర్వహించాలి. బిల్లుల నిర్వహణ ఉండాలి. జిల్లాలో వీటిని పట్టించుకునేవారు లేరు.

ఈనాడు, సిరిసిల్ల

జిల్లాలో ఔషధ నియంత్రణాధికారి(డ్రగ్ ఇన్‌స్పెక్టర్) కార్యాలయం జాడలేదు.. దీంతో ఔషధాలపై తనిఖీలు, నియంత్రణ ఊసేలేకుండా పోయింది. జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ పట్టణాలతో పాటు ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ మండలాల్లో 300 ప్రైవేటు ఆసుపత్రులు, 500లకు పైగా ఔషధ దుకాణాలున్నాయి. గ్రామాల్లో వెయ్యికి పైచిలుకు ప్రథమ చికిత్సా కేంద్రాలు ఉన్నాయి. వీటికి అనుబంధంగా మందులు విక్రయిస్తున్నారు. జిల్లాలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ లేకపోవడంతో వీటిపై పర్యవేక్షణ కరవైంది.

☛ ఇదే అదనుగా కొన్ని ఔషధ దుకాణాల్లో నాసిరకం మందులను ఇష్టమొచ్చిన ధరలకు విక్రయిస్తున్నారు. వీరి ఆగడాలతో సామాన్యుల ప్రాణాలు బలవుతున్నాయి. దీన్ని నియంత్రించేందుకు రెండ్రోజుల క్రితం సిరిసిల్ల పట్టణంలో ప్రజారోగ్య పోరాట సమితి ఆవిర్భవించింది. అంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వీరు జిల్లాలో జరుగుతున్న ఔషధ విక్రయాల ధరల వ్యత్యాసం, ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

నిఘా

సిబ్బంది ఎవరూ లేరు..

- జిల్లాలో 2022 డిసెంబరు వరకు ఉమ్మడి జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. బదిలీల్లో ఇక్కడ పని చేసిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్ యాదాద్రి భువనగిరి జిల్లాకు వెళ్లారు. హైదరాబాద్‌లో పని చేసే ఉద్యోగిని ఇక్కడికి బదిలీ చేశారు. కొన్ని రోజులకు అనారోగ్య కారణాలతో సెలవు పెట్టారు. అప్పటి నుంచి సిద్దిపేట, కామారెడ్డి జిల్లాలకు చెందిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్లకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ నెట్టుకొస్తున్నారు.

- 2021 జులై వరకు కార్యాలయం అద్దె భవనంలో కొనసాగింది. కొత్త కలెక్టరేట్ ప్రారంభంతో గదిని కేటాయించారు. ఇందులో సిబ్బంది లేకపోవడంతో ప్రస్తుతం మిషన్ భగీరథ, నీటి పారుదల శాఖ డివిజన్-7 కార్యాలయాలకు అప్పగించారు. కార్యాలయం నిర్వహణకు సూపరింటెండెంట్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్, అటెండరు ఎవరూ లేరు. తనిఖీలకు వచ్చినప్పుడు సిరిసిల్ల పట్టణంలోని మందుల దుకాణాల యజమానులు కలిసి అన్ని వ్యవహారాలు చక్కబెట్టి సాగనంపుతుంటారు. జిల్లా ఆవిర్భావ నుంచి మందుల దుకాణాలపై ఒక్క కేసు కూడా నమోదుకాకపోవడంపై ఔషధ నియంత్రణ శాఖ పనితీరును తెలియజేస్తోంది.

ఆసాములకే యాప్‌న్న హస్తం

- యూరియా పంపిణీలో అవకతవకలు

న్యూస్‌టుడే, సిరిసిల్ల పట్టణం

ఎరువుల నియంత్రణకు కేంద్రం నూతన విధానం అమలు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ఫర్టిలైజర్ యాప్ బదులు.. వారం క్రితం ఎఫ్‌ఎఫ్‌ఎస్(ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్) యాప్ ప్రవేశపెట్టింది. ఇది రైతుల పాలిట శాపంగా మారింది. రోజులు తరబడి బుకింగ్ కావడం లేదన్న ఆవేదనలు నెలకొన్నాయి.

జిల్లాలో సాగు వివరాలు	
వరిసాగు	1.5 లక్షల ఎకరాలు
పత్తి	46 వేల పైచిలుకు
యూరియా డిమాండ్	21 వేల టన్నులు
సరఫరా	13,520 టన్నులు
దుకాణాలు	281
సహకార సంఘాలు	24

సాంకేతిక సమస్యలకు దిక్కేది?

కొత్త యాప్‌లో సాంకేతిక సమస్యలు వస్తున్నాయి. మ్యాపింగ్ ప్రక్రియ సజావుగా లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. రెండు, మూడు సర్వే నంబర్లు ఉన్న కర్షకుల పరిస్థితి దయనీయంగా ఉంది. ఒక సర్వే నంబరు మాత్రమే ధ్రువీకరించినట్లు కనిపిస్తోంది. ఇతర సర్వే నంబర్ నమోదు చేసినా ఆమోదం లభించడం లేదు. రైతులు పంట వేసి నెలలు గడుస్తున్నా యూరియా వేయని పరిస్థితులు నెలకొన్నాయి. కొత్త మండలాల్లో మ్యాపింగ్ ఇబ్బందికరంగా మారింది. సాంకేతిక సమస్యలు రాష్ట్రస్థాయిలో పరిష్కారం కావాల్సి ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

గ్రామాల్లో పేరు మోసిన ఆసాములను ఓ సామాజిక మాధ్యమంలో సమూహంగా చేర్చి.. యూరియా నిల్వలు, పంపిణీ సమయాలను ముందుగానే చేరవేస్తున్నట్లు తెలుస్తోంది.. యాప్‌లో సరిగ్గా బుకింగ్ అవకాశం ఇచ్చే సమయానికి సిద్ధంగా ఉన్నవారికే యాప్‌లో బుక్ అవుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సెకన్ల వ్యవధిలో నిల్వలు నిండుకున్నట్లు చూపిస్తోంది.

5 నిమిషాల్లోనే..

కోనరావుపేట మండలం కొలనూర్ పీఏసీఎస్‌కు ఇటీవల 450 బస్తాల యూరియా రాగా అధికారులు మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో బుకింగ్ అవకాశం ఇచ్చారు. కేవలం 5 నిమిషాల్లోనే పూర్తికాగా ఆన్‌లైన్‌లో నిల్వలు లేవని చూపించింది. చాలా మంది రైతులకు నిరాశే ఎదురైంది.

రైతులకు తెలియకుండా..

వ్యవసాయ శాఖ అధికారులు యూరియా వివరాలను రైతులకు తెలిసేలా ఉంచడం లేదు. మండలానికి కేటాయించిన నిల్వ, పంపిణీ తేదీలు బహిరంగంగా ప్రకటించకపోవడం విమర్శలకు దారి తీస్తోంది. రిటైలర్‌ల విషయంలో రైతులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. వారి దుకాణాల్లో పురుగు మందులు కొనుగోలు చేసే రైతులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెబుతున్నారు. వారికి నిల్వల సమాచారం చేరవేసి.. బుకింగ్ సమయాలను వెల్లడిస్తున్నారు.

వివరాలు వెల్లడించడం లేదు..

- నర్సయ్య, రైతు, శాంతినగర్



వరి వేసి 50 రోజులు అవుతోంది.. పొట్ట దశలో యూరియా వేయకుంటే దిగుబడులపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. యూరియా పంపిణీ సమాచారం రైతులకు తెలియడం లేదు. డీలర్లు సైతం వివరాలు వెల్లడించడం లేదు. రిటైలర్‌లు తెలిసిన వారికే సామాజిక మాధ్యమాల్లో సమాచారం అందిస్తున్నారు.

నీరుగారిన.. ట్యాంకుల నిర్వహణ

జిల్లాలో ఇలా..	
పంచాయతీలు	: 260
ఆవాస ప్రాంతాలు	: 359
పాత ట్యాంకులు	: 378
కొత్తవి	: 248
పైపులైన్ పొడవు	: 1,263 కి.మీ
నల్లాలు	: 1.36 లక్షలు
రోజువారీ నీటి వినియోగం	: 10 కోట్ల లీటర్లు



వీర్నపల్లి మండలం మద్దిమల్లలో ఓ ట్యాంకు పిల్లర్లపై నాలుగేళ్ల క్రితం తేదీలు ఉన్నాయి. 2020లో శుభ్రం చేసినట్లు ఉంది. అప్పటి నుంచి శుభ్రం చేయడం లేదా..? అని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు.

న్యూస్‌టుడే, వీర్నపల్లి, కోనరావుపేట, ముస్తాబాద్,

పరిశీలన

ప్రతి ఇంటికి రక్షిత మంచినీటి సరఫరాకు సర్కారు రూ.కోట్లలో వ్యయం చేస్తోంది.. శుద్ధి చేసిన మిషన్ భగీరథ నీటితో ఉపరితల భాండాగారాలను నింపుతున్నారు. జనాలకు సరిపడా అందించేందుకు స్థానిక బోరుబావుల నీటిని సైతం వినియోగిస్తున్నారు. ఇక్కడివరకు బాగానే ఉన్నా ట్యాంకుల శుభ్రతలో నిబంధనలను బుట్టదాఖలు చేస్తున్నారు. పాకురు పట్టిన గోడలు వెక్కిరిస్తుంటే.. ఊగుతున్న నిచ్చెనలు కార్మికులను భయకంపితులను చేస్తున్నాయి. శుభ్రత పేరిట కేవలం నీటిని తొలగించి, కొత్త నీటికి క్లోరినేషన్ చేస్తున్నారు. ట్యాంకు గోడలు, అడుగు భాగం కడగకపోవడంతో నీటి నాణ్యత లోపిస్తోంది. ప్రతి నెలా 1, 11, 21 తేదీల్లో తప్పనిసరిగా కడగాలి. ఈ మేరకు బోర్డులపై రాయాలి. కానీ, నిబంధనలు అమలుకు నోచడం లేదు. నాలుగేళ్ల కిందటి తేదీలు ఇప్పటికీ కనిపిస్తున్నాయి. ట్యాంకు పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి.

బోరు బావులే దిక్కు..



ముస్తాబాద్ మండల కేంద్రంలో నాలుగు ఓవర్ హెడ్ ట్యాంకులు ఉన్నాయి.. మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో నిరుపయోగంగా మారాయి. బోరుబావుల నీరే దిక్కయింది.. ఇప్పటికే మిషన్ భగీరథ అధికారులు గ్రామాన్ని సందర్శించి మంచినీటి సరఫరాపై పర్యవేక్షించారు.

నామమాత్రంగా శుభ్రం



కోనరావుపేట మండలం కొలనూర్‌లో వాటర్ ట్యాంకుపై శుభ్రం చేసిన తేదీలు నమోదు చేయలేదు.. పంచాయతీ కార్యదర్శుల పనితీరుపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



వీర్నపల్లి మండలం ఎర్రగడ్డతండాలో ట్యాంకు ఇది.. మూత లేదు.. లోపలికి దిగే నిచ్చెన సైతం పాకురు పట్టి అధ్వానంగా ఉంది.. నీరు దుర్వాసన వస్తోంది.

ఎస్సారెస్పీకి 2 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జగిత్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే : ఉత్తర తెలంగాణ సాగునీటి వరదాయిని శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి ఆదివారం సాయంత్రం వరకు 2,180 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ఎగువన కురిసిన వర్షాలతో స్వల్ప ప్రవాహం వస్తోంది. 963 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉంది. ప్రాజెక్టులో నీటి నిల్వ 44.713 టీఎంసీలుగా, నీటి మట్టం 1079.90 అడుగులుగా ఉంది.

వినూత్న బోధన.. విదేశీ విద్యపై శోధన

జిల్లా నుంచి సింగపూర్ పర్యటనకు ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. కోనరావుపేట మండలం సుద్దాల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మంజులాదేవి, తంగళ్లపల్లి మండలం మండేపల్లి మాడల్ పాఠశాలకు చెందిన బెల్లెపు రజిత(పీజీటీ మ్యాథ్స్) ఈ అవకాశాన్ని దక్కించుకున్నారు. వినూత్న బోధనతో గుర్తింపు పొందిన వీరు.. సింగపూర్‌లో విద్యా విధానాన్ని అధ్యయనం చేయనున్నారు.

- న్యూస్‌టుడే, కోనరావుపేట

ఐఐటీపై అవగాహన కలిగేలా..



ఉపాధ్యాయుల సమష్టి కృషితో విద్యార్థులను అన్ని రంగాల్లో భాగస్వాములను చేసేలా నిరంతరం కృషి చేస్తున్నారు సుద్దాల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నన్నపురాజు మంజులా దేవి. పాఠశాలలో 146 మంది విద్యార్థులు ఉన్నారు. వార్షిక పరీక్షల్లో భయాందోళన తొలగేలా ప్రధాని మోదీ నిర్వహిస్తున్న పరీక్ష పే చర్చా కార్యక్రమానికి 2004-25 ఏడాదికి పదో తరగతి విద్యార్థి అలువాల సాయితేజ దిల్లీలో పాల్గొన్నారు. ఐఐటీపై అవగాహన కలిగేలా మద్రాస్ ఐఐటీ ఆన్‌లైన్‌లో 15 రోజుల శిక్షణ కోర్సులకు విద్యార్థులు అధిక సంఖ్యలో దరఖాస్తు చేసుకొని ధ్రువీకరణ పత్రాలు పొందారు.. ప్రభుత్వం, విద్యాశాఖ నిర్వహించే ఇన్నోవేషన్, క్రియేషన్ కార్యక్రమాలపై అవగాహన కల్పించి ప్రోత్సహిస్తున్నారు.

12 ఏళ్లుగా గణితంలో శతశాతం ఉత్తీర్ణత



మండేపల్లి తెలంగాణ మాడల్ పాఠశాలలో బెల్లెపు రజిత పీజీటీ గణితం ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. గతంలో కరీంనగర్ ఎలగందులలో పదేళ్లు, మండేపల్లిలో రెండేళ్లుగా విధులు నిర్వహిస్తూ.. విద్యార్థులు గణితంపై పట్టు సాధించేలా సులభతర, వీడియో రూపంలో బోధన చేస్తున్నారు. విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా ఎక్కువ సమయం కేటాయించి సాధన చేయిస్తున్నారు.. 12 ఏళ్లుగా పదిలో విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారు. తెలంగాణ మ్యాథ్స్ ఫోరం(టీఎంఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించే పోటీల్లో విద్యార్థులకు అధిక సంఖ్యలో భాగస్వాములను చేసేలా ప్రోత్సహిస్తున్నారు. గతేడాది పాఠశాలకు చెందిన స్పృహన్‌కుమార్ టీఎంఎఫ్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాడు.

అన్నదాత.. వెలుగుల ప్రదాత

న్యూస్‌టుడే, గంభీరావుపేట



నాగంపేటలో సోలార్ ప్లాంటు వద్ద ఎన్పీడీసీఎల్ అధికారులు

రైతులు కేవలం వ్యవసాయంపై ఆధారపడకుండా.. సౌర విద్యుత్తును ఉత్పత్తి చేసి ఆర్థికంగా ఎదగడానికి కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. పీఎం- కుసుమ్ పథకం కింద సౌర ప్లాంట్ల ఏర్పాటుకు ప్రోత్సహిస్తోంది. రాష్ట్రంలో ఇప్పుడిప్పుడే రైతులు ముందుకొస్తున్నారు. జిల్లాలోనూ అయిదుగురు రైతులు 2 మెగావాట్ల చొప్పున సౌర విద్యుత్తు ప్లాంట్లను ఏర్పాటు చేశారు.

జిల్లాలో పూర్తయిన ప్లాంట్లు(2 మెగావాట్)	
☛ కోనరావుపేట	ధర్మారం, మర్తనపేట
☛ బోయినిపల్లి	కోరెం
☛ వేములవాడ రూరల్	మల్లారం
☛ గంభీరావుపేట	నాగంపేట
పనులు కొనసాగుతున్నవి..	
☛ ఇల్లంతకుంట	చింతకుంటపల్లి
☛ ఎల్లారెడ్డిపేట	అక్కపెల్లి
☛ తంగళ్లపల్లి	లక్ష్మీపూర్
☛ కోనరావుపేట	మర్తనపేట

విధివిధానాలు..

ఈ పథకంలో రెండు మెగావాట్ల వరకు విద్యుదుత్పత్తి ప్లాంటును ఏర్పాటు చేసుకోవచ్చు. బ్యాంకు నుంచి దాదాపు 80 శాతం రుణం దక్కేలా ప్రభుత్వం చేయూతనిస్తుంది. 6 నుంచి 7 ఎకరాల స్థలం అవసరం. పెట్టుబడి రూ.7 కోట్ల నుంచి రూ.8 కోట్ల వరకు ఉంటుంది. స్థలం చదునుగా ఉండి విద్యుత్తు ఉపకేంద్రం దగ్గరగా ఉంటే ఖర్చు తగ్గుతుంది. 5 కి.మీ పరిధిలో విద్యుత్తు ఉపకేంద్రం ఉంటేనే అనుమతి లభిస్తుంది.

ప్రయోజనమిలా..

ఒక మెగావాట్ ప్లాంటులో ఏడాదిలో 1.35 లక్షల యూనిట్లు, 2 మెగావాట్ల ప్లాంటులో 2.70 లక్షల యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. వర్షాకాలంలో తక్కువ ఉత్పత్తి వచ్చినా, వేసవిలో పెరుగుతుంది. ఒక్కో యూనిట్‌కు ప్రభుత్వం రూ.2.98 అందిస్తుంది. ఈ లెక్కన దాదాపు రూ.8 లక్షల వరకు ఆదాయం వస్తుంది. ప్లాంట్ నిర్వహణ ఖర్చు, సిబ్బందికి జీతాలు పోను రూ.4 నుంచి 5 లక్షల వరకు లాభం వస్తుందని అధికారులు చెబుతున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

-అంజయ్య, డీఈ, ఎన్పీడీసీఎల్

జిల్లాలో 17 మంది సోలార్ ప్లాంట్ల నుంచి గ్రిడ్‌కు అనుసంధానం చేయడానికి దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం 5 పూర్తయ్యాయి. మరో నాలుగింటి ప్రక్రియ కొనసాగుతోంది. త్వరలో అక్కపెల్లి ప్లాంటు విద్యుత్తు ఉపకేంద్రానికి అనుసంధానం చేయనున్నారు. రైతులు పథకాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగవచ్చు.

సుందరేశ్వరస్వామికి అన్నపూజ



కరీంనగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: నగునూరులోని శ్రీదుర్గాభవాని ఆలయ ప్రాంగణంలోని శ్రీసుందరేశ్వరస్వామికి ఆదివారం ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు, అన్న పూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎల్‌పీజీ విస్ఫోటం.. పోరాడితే పరిహారం

మీకోసం

న్యూస్‌టుడే, సిరిసిల్ల పట్టణం : ఇళ్లల్లో, ఇతర ప్రదేశాల్లో గ్యాస్ ప్రమాదాలు జరిగాయన్న వార్తలు తరచూ వింటుంటాం.. ఎంత జాగ్రత్తగా ఉన్నా.. విస్ఫోటం జరిగితే ప్రమాద స్థాయి ఘోరంగా ఉంటుంది. మానవ ఆరోగ్యం.. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాయితీపై ఆయిల్ కంపెనీలు ఎల్‌పీజీ సిలిండర్‌లు సరఫరా చేస్తున్నాయి. గ్యాస్ వినియోగించే క్రమంలో ప్రమాదం సంభవిస్తే లయబిలిటీ ఇన్సూరెన్స్ ద్వారా పరిహారం పొందే అవకాశం ఉంటుంది. సరైన అవగాహన లేక చాలా మంది వినియోగదారులు నష్టపోతున్నారు.

☛ గ్యాస్‌బండ విస్ఫోటం చెంది ప్రమాదంలో మరణం సంభవిస్తే రూ.6 లక్షల వరకు, గాయపడితే రూ.2 లక్షల నష్ట పరిహారంతో పాటు ఆస్తి నష్టానికి రూ.లక్ష వరకు క్లెయిమ్ చేసుకునే అవకాశం ఉంటుంది.. సమీప పోలీసు స్టేషన్‌తో పాటు, గ్యాస్ ఏజెన్సీకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలి. ఎఫ్‌ఐఆర్ నమోదు చేసిన తర్వాత ఏజెన్సీ అధికారులు, ఆయిల్ కంపెనీ ప్రతినిధులు వచ్చి విచారణ చేపడతారు. నిజానిజాలను నిర్ధారించి పరిహారానికి సిఫార్సు చేస్తారు.

☛ విచారణ అనంతరం ఎఫ్‌ఐఆర్ కాపీ, మరణోత్తర పరీక్ష నివేదిక, మరణ ధ్రువీకరణ పత్రం, గాయపడితే ఆసుపత్రి బిల్లులు, డిశ్చార్జి సమ్మరీ, ఆస్తినష్టం జరిగితే ఫొటోలు, అంచనా పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. బీమా సంస్థ పరిశీలన అనంతరం బాధితులకు, నామినీకి పరిహారం అందిస్తారు.

భీమేశ్వర క్షేత్రంలో భక్తుల సందడి

వేములవాడ, న్యూస్‌టుడే : దక్షిణ కాశీగా పేరొందిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి అనుబంధ శ్రీ భీమేశ్వరస్వామి క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. దాదాపు 40 వేల మందికి పైగా స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం, క్యూలైన్లు, కల్యాణ కట్ట, ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. భక్తులు ముందుగా కుటుంబ సమేతంగా స్వామివారికి కోడె మొక్కులు చెల్లించుకున్నారు. కల్యాణాలు, అభిషేకం, కుంకుమ పూజలు, సత్యనారాయణ వ్రతాలు వంటి ఆర్జిత సేవలతో తరించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు పర్యవేక్షణ చేశారు. అమ్మవారికి కల్లు, కోళ్లు సమర్పించారు.



కోడె మొక్కుల వద్ద భక్తులు

నీట్ ప్రశాంతం

కరీంనగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో నిర్వహించిన నీట్ పీజీ-2026 పరీక్ష ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది. పరీక్ష నిర్వహణను ఆదివారం కలెక్టర్ చిత్రామిశ్రా, పోలీసు కమిషనర్ గౌష్ ఆలం పర్యవేక్షించారు. తిమ్మాపూర్‌లోని వాగేశ్వరీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు, భద్రతా చర్యలను పరిశీలించారు. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థుల ప్రవేశం, భద్రతా తనిఖీలు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, బయోమెట్రిక్ ధ్రువీకరణ, తాగునీరు, విద్యుత్తు సరఫరా, వైద్య సదుపాయాలు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలను సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది సమన్వయంతోపరీక్ష విజయవంతం అయిందన్నారు. జిల్లాలో 7 పరీక్ష కేంద్రాల్లో 1,505 మంది అభ్యర్థులకు 1,471 మంది హాజరుకాగా 34 మంది గైర్హాజరయ్యారన్నారు.

పండగ గిరాఖీ

☛ కిక్కిరిసిన బస్టాండ్ ☛ నేడూ రద్దీ కొనసాగే అవకాశం



కరీంనగర్ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

న్యూస్‌టుడే, కరీంనగర్ రవాణా విభాగం

రక్షాబంధన్‌కు వచ్చినవారు స్వస్థలాలకు బయల్దేరడంతో ఆదివారం కరీంనగర్ బస్‌స్టేషన్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. బస్‌స్టాండ్ ఆవరణలో ఎక్కడ చూసినా జనమే కనిపించారు. ప్లాట్‌ఫాంలు వదిలి ప్రయాణికులు ఇన్‌గేట్, కరీంనగర్-1, 2 డిపోల ముందు బస్సుల కోసం పడిగాపులు కాశారు. బస్సులురాగానే పరుగులు తీయగా సెక్యూరిటీ సిబ్బంది బస్సుల వద్ద ఉంటూ నేరుగా ప్లాట్‌ఫాంల పైకి వెళ్లేలా చూశారు.

అదనపు సర్వీసులు

జేబీఎస్ రూట్లో నిత్యం 330 బస్సులు తిరుగుతుండగా 120 సర్వీసుల్లో ముందస్తు సీట్ రిజర్వేషన్లు చేసుకునే వీలుండేది. రద్దీ దృష్ట్యా జేబీఎస్‌కు అదనంగా 200 బస్సులు నడపగా అందులో 180 సర్వీసుల్లో రిజర్వేషన్ వెసులుబాటు కల్పించారు. వీటితోపాటు అదనంగా మరో 40 సిటీ బస్సులను తెప్పించినట్లు ఆర్ఎం రాజు తెలిపారు. ఆర్ఎంతోపాటు కరీంనగర్ జోన్ సెక్యూరిటీ అధికారి భావ్‌రావు బస్టాండ్‌లో మకాం వేసి పరిస్థితిని పరిశీలించారు.

ముందస్తు రిజర్వేషన్

ప్రయాణికుల రద్దీ సోమవారం కొనసాగే అవకాశం ఉంది. దీంతో అధికారులు అదనపు సర్వీసులు తిప్పడం, అవసరమైతే సిటీ బస్సులు తెప్పించడం వంటి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. నాన్ రిజర్వేషన్ బస్సులతోపాటు ముందస్తు టికెట్ రిజర్వేషన్ కోసం అదనపు బస్సులను అందుబాటులో ఉంచుతున్నారు. అవకాశం ఉన్న ప్రయాణికులు ముందస్తు టికెట్ రిజర్వేషన్ సదుపాయాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.



డిపోలోకి చొచ్చుకెళ్లగా..

రెండో డిపోలో ఎలక్ట్రిక్ బస్సులు ఉండగా కొందరు ప్రయాణికులు డిపోలోకి చొచ్చుకు వెళ్లి బస్సు ఎక్కడానికి ప్రయత్నించగా సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. జేబీఎస్, కామారెడ్డి, వరంగల్, హనుమకొండ, గోదావరిఖని, జగిత్యాల, ఆదిలాబాద్, మంచిర్యాల రూట్లలో తీవ్రమైన రద్దీ నెలకొంది. పలు రూట్లలో సరిపడా బస్సులు లేక ప్రయాణికులకు ఎదురుచూపులు తప్పలేదు.

చేతుల శుభ్రత.. ఆరోగ్య భద్రత

పిల్లలకు అలవాటుగా మారితే వ్యాధులు దూరం

న్యూస్‌టుడే, మెట్‌పల్లి

వర్షాకాలంలో పిల్లలు సీజనల్, అంటువ్యాధుల బారిన పడుతుంటారు. వ్యక్తిగత శుభ్రత పాటించడంతో పాటు చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధులు దరి చేరకుండా ఉంటాయి. చేతులను శుభ్రంగా ఉంచుకుంటే పలు రకాల వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్త పడొచ్చు. తీసుకునే ఆహారం, తాగే నీరు వేడిగా, శుద్ధిగా ఉంటే ఆరోగ్యం సురక్షితంగా ఉంటుందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

పాఠశాలల్లో అవగాహన

చిన్నారులు ఆరుబయట మట్టి, ఇసుకలో ఆటలాడి చేతులను శుభ్రం చేసుకోకపోవడం తదితర కారణాలతో వ్యాధులు ప్రబలే ప్రమాదముంది.



మెట్‌పల్లి బడిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నర్సింగ్ అధికారి

అపరిశుభ్ర చేతులతో భోజనం తినడం వల్ల హానికర సూక్ష్మక్రిములు శరీరంలోకి ప్రవేశించి ఇన్ఫెక్షన్లు, విరేచనాలు, శ్వాసకోశ వ్యాధులు వస్తాయి. ఉమ్మడి జిల్లాలో చాలా పాఠశాలల్లో చేతుల శుభ్రతపై విద్యార్థులకు వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తున్నారు. ఇది అలవాటు చేసుకుంటే జలుబు, ఫ్లూ వంటి ఇన్ఫెక్షన్లు రావు. శరీరంలోకి బ్యాక్టీరియాలు చేరకుండా ఉంటుంది.

ఉమ్మడి జిల్లాలో బడికి వెళ్లే పిల్లల వివరాలు ఇలా..

జిల్లా	జగిత్యాల	కరీంనగర్	పెద్దపల్లి	రాజన్న సిరిసిల్ల
పాఠశాలలు	850	692	579	533
విద్యార్థులు	57,946	37,814	29,171	39,161

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- చేతుల శుభ్రతతో డయేరియా, కలరా, టైఫాయిడ్ వంటి వ్యాధులు రాకుండా అరికట్టవచ్చు.
- మట్టిలో ఆడి, మలవిసర్జన తర్వాత చేతులు సరిగ్గా శుభ్రం చేసుకోక ఆహారం తీసుకుంటే కడుపులో నులి పురుగులు తయారై రక్తహీనతకు దారి తీస్తోంది. తద్వారా రోగనిరోధకశక్తి తగ్గి త్వరగా వ్యాధుల బారిన పడే ప్రమాదముంది.
- పిల్లలు చేతిగోళ్లను ఎప్పటికప్పుడు తొలగించుకోవాలి. గోళ్లలో మట్టి చేరకుండా ఉంటుంది.
- పెంపుడు జంతువులను, దుమ్ము, ధూళి ఉన్న వస్తువులను తాకిన తర్వాత, ఆహారం తినడానికి ముందు, మల, మూత్ర విసర్జన తర్వాత సబ్బు ఉపయోగించాలి.

తల్లిదండ్రులు నేర్పించాలి



శుభ్రత లోపంతో పిల్లలకు అనేక వ్యాధులు వస్తాయి. తల్లిదండ్రులు చేతులను శుభ్రంగా కడుక్కోవడాన్ని పిల్లలకు నేర్పించాలి. పిల్లల చేతి గోళ్లలో తరచూ మట్టి చేరడం గమనిస్తుంటాం. దీంతో కడుపులో ఇన్ఫెక్షన్లు, నులి పురుగుల సమస్యలు వస్తాయి.

-డా.రాజేశ్వర్, పిల్లల వైద్య నిపుణులు, మెట్‌పల్లి సీహెచ్‌సీ



ప్రధాని మోదీ ప్రసంగాన్ని వింటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

మన్‌కీబాత్ వీక్షించిన హోంశాఖ సహాయ మంత్రి

తెలంగాణచౌక్(కరీంనగర్) : ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహించిన 137వ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తన నివాసంలో పార్టీ శ్రేణులతో కలిసి వీక్షించారు. మన్‌కీబాత్ ద్వారా మోదీ వివిధ అంశాలపై తన అభిప్రాయాలు వివరిస్తుంటారన్నారు. మేయర్ కొలగాని శ్రీనివాస్, భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు, భాజపా జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, మాజీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూల్యాంకనానికి ప్రత్యేక నిధులు

న్యూస్‌టుడే, వెల్గటూరు

పాఠశాలల్లో సంగ్రహణాత్మక మూల్యాంకనం విధానంలో ఎస్ఏ- 1, 2 పరీక్షలకు పాఠశాల విద్యాశాఖ పలు మార్పులు తీసుకొచ్చింది. మూల్యాంకన వ్యవస్థ విశ్వసనీయతను బలోపేతం చేసేందుకు జవాబు పత్రాల మూల్యాంకనంలో నిష్పాక్షికత, పారదర్శకత, జవాబుదారీతనం, కచ్చితత్వాన్ని పెంపొందించేలా బాహ్య మూల్యాంకన విధానాన్ని ప్రవేశ పెట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి ఈ విధానాన్ని అమలు పరిచేందుకు మార్గదర్శకాలు జారీ చేశారు. దీని కోసం జిల్లాల వారీగా ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించారు.

☛ మండల స్థాయిలో శిబిరం నిర్వహణకు ఏక మొత్తంలో రూ.10వేలు కేటాయించారు. ప్రాథమిక స్థాయిలో ఒక్కో జవాబు పత్రానికి రూ.2, హైస్కూల్ స్థాయిలో రూ.3 పారితోషికాన్ని చెల్లిస్తారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.50.49లక్షలు కేటాయించారు.

ఉమ్మడి జిల్లా గణాంకాలు:

జిల్లా	మండలాలు	పాఠశాలలు	విద్యార్థులు	నిధులు(రూ.లలో)
జగిత్యాల	20	770	47,532	17,32,040
కరీంనగర్	16	631	32,209	12,21,138
పెద్దపల్లి	14	530	24,637	9,61,322
రాజన్న సిరిసిల్ల	13	486	32,376	11,35,062

డిప్యూటీ రేంజ్ అధికారి సస్పెన్షన్

మల్లాపూర్: జగిత్యాల అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి మహేశ్‌గౌడ్‌ను సస్పెండ్ చేస్తూ అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ అర్పణ ఉత్తర్వులను జారీ చేశారు. ఒబులాపూర్ దాబాలో అటవీ అధికారుల విందుపై సమగ్ర విచారణ చేపట్టగా.. దీనికి కారకుడైన మహేశ్‌గౌడ్‌ను సస్పెన్షన్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులుగా ఉండి పట్టపగలే మందుతో విందు చేసుకున్న సంఘటనలో మరో అయిదుగురు ఉద్యోగులకు ఇప్పటికే మెమోలు జారీ చేసిన విషయం తెలిసిందే. విచారణ పూర్తిస్థాయిలో జరిగితే మరింతమంది అధికారులపై వేటు పడే అవకాశం ఉంది.

దూరవిద్యలో ప్రవేశాలకు పది రోజులే గడువు

కరీంనగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: డా.బి.ఆర్.అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ దూర విద్యలో డిగ్రీ, పీజీ కోర్సుల్లో చేరాలనుకునే వారికి సెప్టెంబరు 9 వరకు అవకాశం ఉందని కరీంనగర్ స్టడీ సెంటర్ సమన్వయకర్త సత్యప్రకాశ్ తెలిపారు. 'ఈనాడు' 'ఫోన్-ఇన్'లో పాఠకుల ప్రశ్నలకు ఆయన జవాబులిచ్చారు. ప్రవేశాలు, పరీక్షలు, కొత్త కోర్సులపై లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేశారు.



ఫోన్-ఇన్

☛ కరీంనగర్ స్టడీ సెంటర్ సమన్వయకర్త సత్యప్రకాశ్

? 2024లో ఎంఏ తెలుగులో ప్రవేశం తీసుకున్నా. పరీక్షలకు హాజరు కాలేదు. ఇప్పుడు రాయొచ్చా -**హరిప్రసాద్, మంచిర్యాల**
✔ సంవత్సరం వారీగా రాసుకోవచ్చు. సెప్టెంబరులో ప్రథమ సంవత్సరం, అనంతరం రెండు, మూడో సంవత్సరాల పరీక్షలు రాయాల్సి ఉంటుంది.

? ఫుడ్ అండ్ న్యూట్రిషియన్ కోర్సు చేయొచ్చా -**సందీప్‌కుమార్, గోదావరిఖని**
✔ ఆరు నెలల సర్టిఫికెట్ కోర్సు అందుబాటులో ఉంది. రూ.1600 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

? నేను జీఎన్ఎం చేసి ప్రస్తుతం ఉద్యోగం చేస్తున్నా. ఇప్పుడు ఓపెన్ డిగ్రీ చేయొచ్చా -**రవీందర్, వరంగల్**
✔ డిగ్రీ చేసుకోవచ్చు.

? ఓపెన్ యూనివర్సిటీలో జాయిన్ అయి జగిత్యాల సెంటర్‌లో డిగ్రీ చేయొచ్చా -**చందు, జగిత్యాల**
✔ జగిత్యాల సెంటర్‌ను ఎంపిక చేసుకోండి.

? 2024లో పీజీలో నమోదు చేసుకున్నా. కొన్ని పరీక్షలు రాయలేదు. ప్రస్తుతం మరోసారి మరో సబ్జెక్టుతో అడ్మిషన్ తీసుకోవచ్చా -**రాజు, వేములవాడ**
✔ తీసుకోవచ్చు.

? మా అమ్మాయి కరీంనగర్ అధ్యయన కేంద్రంలో బీఎస్సీ ఓపెన్ డిగ్రీ చేస్తోంది. ఇక్కడే ప్రాక్టికల్ తరగతులకు హాజరు కావాలా? లేదా మంచిర్యాలకు మార్చుకోవచ్చా -**టి.గోపాల్, జన్నారం, మంచిర్యాల జిల్లా**
✔ ప్రాక్టికల్ తరగతులకు హాజరు కావాలి. స్టడీ సెంటర్‌ను కరీంనగర్ నుంచి మంచిర్యాలకు మార్చుకునేందుకు హైదరాబాద్ ప్రధాన కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి.

? ఓపెన్ వర్సిటీలో పదేళ్ల కిందట అడ్మిషన్ తీసుకున్నాను. పరీక్షలు రాయలేదు. ఇప్పుడు రాయొచ్చా -**బత్తుల లక్ష్మీనారాయణ, చొప్పదండి**
✔ సెప్టెంబరు 9 వరకు అవకాశం ఉంది. హైదరాబాద్ ప్రధాన కార్యాలయం నుంచి అనుమతి తీసుకొని రండి.

? పీజీలో ఈ ఏడాది కొత్త కోర్సులు ఏమైనా ప్రవేశపెట్టారా -**ఎన్.పద్మావతి, కరీంనగర్**
✔ ఈ ఏడాది ఎం.ఈడీ రెండేళ్ల కోర్సుతో పాటు, ఎంఎస్‌డబ్ల్యూ రెండేళ్ల కోర్సులు అందుబాటులోకి వచ్చాయి.

? 1995-96లో డిగ్రీ ప్రథమ సంవత్సరం పరీక్షలు రాశాను. రెండో సంవత్సరం రాయలేదు. ఇప్పుడు రాయొచ్చా -**శ్యామల, కరీంనగర్**
✔ హైదరాబాద్ ప్రధాన కార్యాలయం నుంచి అనుమతి పొంది రీ అడ్మిషన్ తీసుకోవాలి.

కూరగాయల నర్సరీ.. అనుమతి తప్పనిసరి

మీ కోసం

న్యూస్‌టుడే, మానకొండూర్

కూరగాయల సాగుకు రైతులకు నారు అవసరం కావడంతో నర్సరీలు విచ్చలవిడిగా పెరుగుతున్నాయి. అయితే నర్సరీల నిర్వహణకు అనుమతులు పొందడం తప్పనిసరి అని జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ అధికారులు సూచిస్తున్నారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

☛ నర్సరీ ఏర్పాటుకు ఉద్యాన విస్తరణ అధికారి కార్యాలయం నుంచి దరఖాస్తు ఫారం తీసుకోవాలి. ☛ భారతీయ స్టేట్ బ్యాంకులో నిర్ణీత రుసుం చలానా రూపంలో చెల్లించి రసీదు పొందాలి. ఇందులో ఎకరానికి రూ.2500 చెల్లించాల్సి ఉంటుంది.

☛ పూర్తి చేసిన దరఖాస్తు పత్రానికి బ్యాంకులో చెల్లించిన చలానా రసీదును జత చేసి.. దరఖాస్తును స్థానిక ఉద్యాన విస్తరణ అధికారికి లేదా జిల్లా ఉద్యాన శాఖ కార్యాలయంలో సమర్పించాలి

కావాల్సిన పత్రాలు
★ పట్టాదారు పాస్ పుస్తకం ★ రైతు, కౌలు రైతు ఆధార్ కార్డు ★ మట్టి, నీటి పరీక్ష నివేదికలు ★ రైతు ఒప్పంద పత్రం ★ గ్రామ పంచాయతీ ఆమోద పత్రం ★ నర్సరీ యజమాని ఆధార్

సినిమాలో తన పాట ఉపయోగించారని ఫిర్యాదు



రెండో ఠాణా సీఐకి ఫిర్యాదు చేస్తున్న గాయకురాలు తేలు విజయ, తెలంగాణ రక్షణ సేన నాయకులు

కరీంనగర్ సాంస్కృతికం, నేరవార్తలు న్యూస్‌టుడే: సొంతంగా రచించి, పాడిన 'పున్నామ పున్నామ' పాటను తన అనుమతి లేకుండా జాంబిరెడ్డి-2 సినిమాలో ఉపయోగించారని తెలంగాణ ఉద్యమ గాయకురాలు తేలు విజయ ఆదివారం కరీంనగర్ రెండో ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తేలు విజయ వివరాలను పత్రికాముఖంగా వెల్లడించారు. తాను ఎంతో కష్టపడి రూపొందించుకున్న పున్నామ పాటను తన అనుమతి లేకుండా సినిమాలో ఉపయోగించి తన హక్కులు, మనోభావాలకు భంగం కలిగించారని ఆవేదన వ్యక్తం చేశారు. సినిమా నిర్మాతపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్, పార్లమెంట్ ఇన్‌ఛార్జి లింగంపల్లి నాగరాజు, నాయకులు రంగరవేణి లక్ష్మణ్, కుతాడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మిల్లులో 300 క్వింటాళ్ల రేషన్ బియ్యం నిల్వలు

హుజూరాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: అక్రమంగా రేషన్ బియ్యం నిల్వలున్నాయనే సమాచారంతో హుజూరాబాద్ మండలం రాంపూర్‌లోని తిరుమల ఇండస్ట్రీస్‌లో ఆదివారం సివిల్ సప్లై, టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేపట్టారు. మిల్లులో రేషన్ బియ్యం నిల్వలను గుర్తించారు. అదే సమయంలో మరో రెండు ట్రాలీ ఆటోల్లో రేషన్ బియ్యం రావటంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్లను అదుపులోకి తీసుకొని. ఎక్కడి నుంచి వచ్చాయనే వివరాలపై ఆరా తీస్తున్నారు. హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన రేషన్ దుకాణంలో నుంచి కొంత సేకరించినట్లు సమాచారం. మిల్లులో బియ్యం నిల్వలు సుమారు 300 క్వింటాళ్ల వరకు ఉన్నాయన్నారు. ఈ మేరకు మిల్లు యజమానిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సివిల్ సప్లై శాఖ అధికారులు చెప్పారు. మిల్లును సైతం సీజ్ చేయనున్నట్లు వెల్లడించారు. డీటీసీఎస్ విజయ్‌కుమార్, సివిల్ సప్లై ఇన్‌స్పెక్టర్లు వినోద్‌కుమార్, ఎండీ.అన్వరుల్లా ఖాన్, టాస్క్‌ఫోర్స్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



మిల్లులో బియ్యం లెక్కలు వేస్తున్న సివిల్ సప్లై అధికారులు



జెండాపై కవిరాజు పుస్తకావిష్కరణలో మేయర్ శ్రీనివాస్, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, కవులు, పరిషత్ ప్రతినిధులు

దేశభక్తి కావ్యంగా 108 మంది కవుల సంపుటి

కరీంనగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: జెండాపై కవిరాజు సంపుటి 108 మంది తెలుగు రాష్ట్రాల కవుల కవిత్వంతో దేశభక్తి కావ్యంగా నిలుస్తుందని మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్ భగవతి పాఠశాల వేదికగా ఆదివారం జాతీయ సాహిత్య పరిషత్ జిల్లాశాఖ రూపొందించిన సంపుటి ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డిప్యూటీ మేయర్ సునీల్‌రావు మాట్లాడుతూ సమాజంలో జాతీయవాద ఆలోచనలను రేకెత్తిస్తూ కవులు అక్షరాన్ని ఆయుధంగా మలచారని పేర్కొన్నారు. అఖిల భారతీయ సాహిత్య పరిషత్ జాతీయ పూర్వ అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ యువతలో దేశీయ భావజాలాన్ని నూరిపోసేలా కవులు కృషి చేయాలన్నారు. పరిషత్ తెలంగాణ ప్రాంత అధ్యక్షుడు వడ్లూరి ఆంజనేయులు, కవి, అవధాని డా.గంద్ర లక్ష్మణ్‌రావు, భగవతి విద్యా సంస్థల ఛైర్మన్ రమణారావు, పరిషత్ జిల్లా అధ్యక్షుడు గాజుల రవీందర్, ఆర్ఎస్ఎస్ బౌద్ధిక్ ప్రముఖ్ సామల కిరణ్‌లు, నంది శ్రీనివాస్ పాల్గొన్నారు.

హెచ్‌సీఏ లీగ్ మ్యాచ్‌ల నిర్వహణకు ప్రణాళిక

కరీంనగర్ క్రీడా విభాగం, న్యూస్‌టుడే: అల్గునూరులోని వెల్చాల జగపతిరావు(వీజేఆర్) మెమోరియల్ క్రికెట్ మైదానం, అకాడమీని ఆదివారం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) బాధ్యులు సందర్శించారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) క్రికెట్ ఆపరేషన్స్ కమిటీ(సీఓసీ) అధిపతి అంబటి రాయుడు, జిల్లా క్రికెట్ మౌలిక సదుపాయాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్, మాజీ హెచ్‌సీఏ కార్యదర్శి టి.శేషనారాయణ్, హెచ్‌సీఏ మహిళా క్రికెట్ అభివృద్ధి విభాగం అధిపతి సునీతా ఆనంద్‌లతో కూడిన బృందంరాగా కేడీసీఏ అధ్యక్షుడు వి.ఆగంరావు స్వాగతం పలికారు. వీజేఆర్ మెమోరియల్ క్రికెట్ మైదానం అభివృద్ధి, అందుబాటులోని మౌలిక సదుపాయాలు, టర్ఫ్ వికెట్లు, ప్రాక్టీస్ నెట్స్ గురించి వివరించారు. బీసీసీఐ స్థాయి టోర్నమెంట్లతో పాటు టీజీ-20 లీగ్ మ్యాచ్‌ల నిర్వహణకు అనువైన ప్రమాణాలతో మైదానం ఉందని రాయుడు అభిప్రాయపడ్డారు. హెచ్‌సీఏ లీగ్ మ్యాచ్‌లను కరీంనగర్‌లో నిర్వహించేలా ప్రణాళిక రూపొందిస్తామని హామీ ఇచ్చారు. శేషనారాయణ్ మాట్లాడుతూ కరీంనగర్‌లో ఉన్నత ప్రమాణాలతో కూడిన క్రికెట్ అకాడమీని త్వరలో ఏర్పాటు చేసేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు హెచ్‌సీఏ అన్ని విధాలా సహకరిస్తుందని తెలిపారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అంబటి రాయుడు చిత్రంలో హెచ్‌సీఏ బాధ్యులు

అండర్-16 బాలురు, మహిళా క్రికెటర్లతో ముచ్చట్లు

హెచ్‌సీఏ నిర్వహించిన మహిళల ఓపెన్ సెలెక్షన్స్ ట్రయల్స్‌కు హాజరైన 40 మంది మహిళా క్రికెటర్లు, కేడీసీఏ అండర్-16 బాలురతో అంబటి రాయుడు ముచ్చటించారు. జిల్లాల నుంచి వచ్చే క్రీడాకారులు అందుబాటులోని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సునీత ఆనంద్ మహిళా క్రికెటర్లతో మాట్లాడి వారి శిక్షణ, అభివృద్ధికి సంబంధించిన అంశాలను తెలుసుకున్నారు. ప్రతిపాదిత హెచ్‌సీఏ అకాడమీ ద్వారా కరీంనగర్‌తోపాటు ఉత్తర తెలంగాణలోని పరిసర జిల్లాలకు చెందిన బాలురు, బాలికలు, పురుషులు, మహిళా క్రికెటర్లకు కోచింగ్, మెరుగైన శిక్షణ, ఉన్నతస్థాయి క్రికెటర్లుగా ఎదిగేందుకు అవసరమైన అవకాశాలు కల్పించవచ్చని అభిప్రాయపడ్డారు. హెచ్‌సీఏ సభ్యులు చెకూరి వెంకటేశ్వరరావు, వెంకట్‌రెడ్డి, మహేందర్‌గౌడ్, టీజీ20 హెడ్ క్రికెట్ ఆపరేషన్స్ భరణి, హెచ్‌సీఏకు చెందిన నిశాంత్‌రావులు పాల్గొన్నారు.

స్వేరోస్ అంటే ఆలోచన, ఆచరణ



నాయకులతో కలిసి అభివాదం చేస్తున్న ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్

గంగాధర, న్యూస్‌టుడే: కులం, మత, ప్రాంతం, రాజకీయం, పురుష, మహిళలని కాకుండా ఆలోచన, ఆచరణ, అక్షరం, ఆరోగ్యం, ఆర్థికం, ఆత్మగౌరవానికి ప్రతీకగా స్వేరోస్ ఉంటుందని ఆ సంస్థ వ్యవస్థాపకులు ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గంగాధరలో ఆదివారం స్వేరోస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జ్ఞాన సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం మాట్లాడారు. సామాజిక మాధ్యమాలకు బానిసలై నేడు ఎందరో విద్యార్థులు, యువత నేర ప్రవృత్తిలోకి దిగుతున్నారని అన్నారు. నల్గొండ జిల్లాలో పాఠశాల ప్రిన్సిపల్ రూపారెడ్డిని పదో తరగతి విద్యార్థులు హత్య చేయడం బాధించిందన్నారు. స్వేరో అంటే కఠినమైన క్రమశిక్షణ, ప్రేరణ అని చెప్పారు. ప్రతి శనివారం సాయంత్రం 6 గంటలకు స్వేరో గీతం ఆలపించి ధ్యానం చేయాలన్నారు. స్ఫూర్తినిచ్చే వారిని స్మరించుకోవాలన్నారు. ఉదయం నిర్వహించిన 5 కే పరుగు పందెంలో రాణించిన ముగ్గురికి ప్రోత్సాహకాలు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, స్వేరోస్ ప్రతినిధులు కొంకటి శేఖర్, దాసరి ఉష, నాగి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భాజపా నాయకులను ఎందుకు రాజీనామా కోరలేదు

బాలికపై అత్యాచారం కేసులో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడిపై పార్టీపరంగా భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. గంగాధరలో మీడియాతో మాట్లాడారు. భాజపా నాయకులను వెనకేసుకుంటూ భారాసపై అభాండాలు వేస్తున్నారన్నారు. ఎంఐఎం ఎమ్మెల్సీపై వచ్చిన ఆరోపణలకు ఆ పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీ చర్యలు తీసుకున్నారని చెప్పారు. భాజపా అధికార ప్రతినిధి సంగప్పపై ఆరోపణలు వచ్చినా ఎందుకు చర్యలు తీసుకోలేదన్నారు.

ఆటోను ఢీకొన్న కోళ్ల వ్యాన్

కూలీ మృతి, పలువురికి గాయాలు



లింగాల దేవమ్మ

గంగాధర, న్యూస్‌టుడే: కరీంనగర్-జగిత్యాల జాతీయ రహదారి గంగాధర ప్రధాన కూడలిలో ఆదివారం కోళ్ల మినీ వ్యాన్ ఢీకొన్న ఘటనలో కూలీలతో వెళ్తున్న ఆటో ట్రాలీ బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా పలువురికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు గంగాధర మండలం మంగపేటకు చెందిన 9 మంది మహిళా కూలీలు ట్రాలీ ఆటోలో బోయినపల్లి మండలం మల్కాపూర్‌లో వ్యవసాయ పనులకు వెళ్తున్నారు. ఇదే సమయంలో జగిత్యాల వైపు నుంచి కోళ్ల మినీ వ్యాన్ చోదకుడు పవన్ అతివేగంగా ముందుకు వెళ్లే క్రమంలో ఆటోను ఢీకొట్టగా బోల్తాపడింది. తీవ్రంగా గాయపడ్డ లింగాల దేవమ్మ(59)తోపాటు చొప్పదండి శైలజ, నాగెల్లి రాధ, అతికం మమత, సరోజన, ఆటో చోదకుడు చారీని కరీంనగర్‌లోని ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ దేవమ్మ మృతి చెందారు. క్షతగాత్రులకు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. బాధితులను కరీంనగర్‌లోని ఆసుపత్రిలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శించారు. బాధిత కుటుంబానికి పరిహారం అందించాలని సీఎంవో కార్యాలయానికి ఫోన్ చేసి విజ్ఞప్తి చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్‌కు ఫోన్‌లో సూచించారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ గాయపడ్డ వారిని గంగాధరలో పరామర్శించారు. మృతురాలు దేవమ్మ భర్త దుర్గయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.



ప్రమాదంలో గాయపడ్డ మహిళలు

సంవత్సరీకం చేయడానికి వచ్చి.. చెరువులోపడి

ప్రమాదవశాత్తు ఒకరి మృత్యువాత



మురళి

గంగాధర, న్యూస్‌టుడే: గంగాధర మండలం బూర్గుపల్లిలో ఆదివారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు ఆడెపు మురళి(47) భీవండిలో చేనేత పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. మురళి తల్లిదండ్రుల మృతితో సంవత్సరీకం చేయడానికి కుటుంబీకులతో కలిసి వచ్చారు. మురళి బూర్గుపల్లిలోని చెరువు వద్దకు కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి నీటిలో మునిగి ఈత రాక మృతి చెందాడు. భార్య సరళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా... (10 AM TO 1 PM)
సిరిసిల్ల అర్బన్ : 9676021687
వేములవాడ : 8008573554

? **సిరిసిల్ల అర్బన్ :** పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం వెనకాల ప్రహరీ పక్కన పిచ్చిమొక్కలు పెరిగి దోమలు విజృంభిస్తున్నాయి. తొలగించేలా చర్యలు తీసుకోవాలి. -శ్రావణ్‌కుమార్, ప్రగతినగర్ వాసి

✔ వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి తొలగించేలా చర్యలు తీసుకుంటాం. -మహేష్, పారిశుద్ధ్య విభాగం ఇన్‌ఛార్జి.

భగీరథ నీరు.. వృథా తీరు



వేములవాడ మండల పరిషత్ కాంప్లెక్స్ వెనుక రోడ్డులో చాలా రోజులుగా మిషన్ భగీరథ నీరు రోడ్డుపై పారి వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ గేట్ వాల్వ్ నుంచి నీరు లీకవుతోంది. వాహనాల రాకపోకల సందర్భంగా బురద మీద పడుతోందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, వేములవాడ

పార్కులో మూగబోయిన సంగీతం

వేములవాడ పట్టణంలోని మండల పరిషత్ కాంప్లెక్స్ ఆవరణలోని మున్సిపల్ పార్కులో కొంతకాలంగా సంగీతం మూగబోయింది. ఆహ్లాదం కోసం పట్టణ ప్రజలు, యువత ఉదయం, సాయంత్రం వేళల్లో వస్తుంటారు. పార్కు ప్రారంభించినప్పుడు వివిధ రకాల భక్తి, సినిమా పాటలు, సంగీతంతో మైమరిపించేవి. అలాంటి సంగీతం కొంత కాలంగా వినిపించడం లేదు. మున్సిపల్ అధికారులు సంగీతాన్ని పునరుద్ధరించాలని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు. -న్యూస్‌టుడే, వేములవాడ



ఘనంగా బోనాల పండగ



కోనరావుపేట, న్యూస్‌టుడే : కొండాపూర్‌లో గ్రామ దేవత పోచమ్మ బోనాల పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవత నూతన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనలో భాగంగా మహిళలు అలంకరించిన బోనాలను నెత్తిన పెట్టుకుని డప్పుచప్పుళ్లు, నృత్యాల మధ్య ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచి గౌతమి, ఉప సర్పంచి పుల్లెద రాజిరెడ్డి పాల్గొన్నారు.

క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం



క్రీడాకారులను సన్మానిస్తున్న రాజు

తంగళ్లపల్లి : ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించేలా ప్రత్యేక ప్రణాళికతో ముందుకు పోతోందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజు అన్నారు. ఆదివారం సిద్దిపేటలో జరిగిన అండర్-16లో రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీ సెమీ ఫైనల్‌లో కరీంనగర్ జట్టుపై సారంపల్లి ఫ్రెండ్స్ క్రికెట్ అకాడమీ జట్టు విజయం సాధించిన సందర్భంగా జట్టు సభ్యులను శాలువాలతో సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో భరత్, కిషన్, వినీష్ క్రీడాకారులు పాల్గొన్నారు.

పింఛన్ల దరఖాస్తు గడువు పొడిగించాలని డిమాండ్

సిరిసిల్ల(విద్యానగర్), న్యూస్‌టుడే : చేనేత, జౌళిశాఖ అధికారులు చేయూత పింఛన్ల దరఖాస్తు గడువు పొడిగించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి డిమాండ్ చేశారు. సిరిసిల్లలో ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. చేనేత, జౌళిశాఖ అధికారుల తీరుతో సిరిసిల్ల పవర్‌లూం, అనుబంధరంగ కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. కలెక్టర్ ఈ నెల 31న దరఖాస్తు గడువు ముగుస్తుందని తెలిపారన్నారు. కానీ చేనేత, జౌళిశాఖ అధికారులు గుర్తింపు కార్డుల జారీలో విఫలమయ్యారని చెప్పారు. కార్మికులకు అన్యాయం జరిగితే చేనేత, జౌళిశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని తెలిపారు. సమావేశంలో నాయకులు అజ్జ వేణు, సోమ నాగరాజు, హరికృష్ణ, రాజమల్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పంతం రవి

రైతుల భూములు లాక్కోవడం అన్యాయం

వేములవాడ గ్రామీణం, న్యూస్‌టుడే : మర్రిపల్లి గ్రామంలో రైతుల భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నాలను అధికారులు విరమించుకోవాలని భాజపా మండల అధ్యక్షుడు బూరుగుపల్లి పరమేశ్ అన్నారు. పార్టీ నాయకులతో కలిసి మర్రిపల్లిలోని రైతుల భూములను ఆదివారం పరిశీలించారు. 1970లో సర్వే నంబరు 748లో సుమారు 200 ఎకరాల భూమిని పేద, మధ్య తరగతి కుటుంబాలకు పంపిణీ చేశారని చెప్పారు. గత భారాస ప్రభుత్వం రైతుల భూములను తీసుకోవడానికి ప్రయత్నించగా, రైతులతోపాటు ప్రస్తుత ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వ్యతిరేకించారని అన్నారు. రైతులు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, ఇప్పుడు భూములు తీసుకుంటే వారి పరిస్థితి ఏంటన్నారు. నాయకులు శేఖర్, కుంటయ్య, శ్రీనివాస్, తిరుపతి, నరేశ్, రాజేందర్, రాజు, రవి కిషోర్, బాబు ఉన్నారు.



పంట పొలాలను పరిశీలిస్తున్న భాజపా నాయకులు

రైతులపై సర్కారు కపట ప్రేమ

వీర్నపల్లి, న్యూస్‌టుడే : రాష్ట్రంలో సర్కారు రైతులపై కపట ప్రేమ ప్రదర్శిస్తూ వ్యతిరేక విధానాలు అవలంభిస్తోందని భారాస జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఆరోపించారు. మండల కేంద్రంలోని సామాజిక భవనంలో ఆదివారం నిరసన సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో భారాస మండలాధ్యక్షుడు రాజిరెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు కళ, సెస్ డైరెక్టర్ మల్లేశం, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భారాస జిల్లా అధ్యక్షుడు ఆగయ్య

కాంగ్రెస్ నూతన కమిటీల నియామకం

వేములవాడ, న్యూస్‌టుడే : వేములవాడ పట్టణ కాంగ్రెస్ నూతన కమిటీని అధ్యక్షుడు తూమ్ మధు ప్రకటించారు. దాదాపు 36 మందితో జాబితా వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ విప్, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నాయకత్వంలో జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ ఆదేశాలతో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చిలుక రమేష్, రాకేష్, విష్ణుప్రసాద్, పులి రాంబాబు, పీర్ మహ్మద్ పాల్గొన్నారు.

వేములవాడ గ్రామీణం : వేములవాడ గ్రామీణ మండల కాంగ్రెస్ కమిటీని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ ఆదేశాల మేరకు నియమించినట్లు అధ్యక్షుడు సోయినేని కరుణాకర్ తెలిపారు. ఉపాధ్యక్షులుగా సత్యనారాయణ రెడ్డి, శంకర్, కాశీగౌడ్, ప్రధాన కార్యదర్శులుగా కొమురయ్య, అజయ్, నరేశ్, తిమ్మన్న, మల్లేశం, ఎల్లయ్య, మధు, కార్యదర్శులుగా గంగ, లక్ష్మణ్, విష్ణు, రాధాకృష్ణ, లింగయ్య, షేక్ హుస్సేన్, వెంకటేశ్, అనిల్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా శారద, లత, కవిత, లావణ్య, మల్లేశం, లచ్చవ్వ, నర్సయ్య, మల్లేశం, అధికార ప్రతినిధిగా జైపాల్‌రెడ్డి, వీరారెడ్డి, కోశాధికారిగా ప్రభాకర్ నియామకమయ్యారు.

సొంతింటి కల సాకారం

తంగళ్లపల్లి, న్యూస్‌టుడే : అర్హులైన నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజు అన్నారు. ఆదివారం తంగళ్లపల్లి మండలం తాడూరులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ప్రవీణ్, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ నర్సింగం, సర్పంచి సదానందం పాల్గొన్నారు.

ధర్నా విజయవంతం చేయండి

కోనరావుపేట, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం బీడీ కార్మికులు, వృద్ధులకు పింఛను ఇవ్వాలని చేపట్టే ధర్నాకు భారీగా తరలిరావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం మ్యానిఫెస్టోలో బీడీ కార్మికులకు నెలకు రూ.4 వేలు, వృద్ధులకు రూ.4 వేలు ఇస్తామన్న హామీని నెరవేర్చాలన్నారు.

ద్రవరూపం.. పంటలకు అపురూపం

న్యూస్‌టుడే, తంగళ్లపల్లి

పంట పొలాలకు ఎరువుల వినియోగాన్ని దశలవారీగా తగ్గించేందుకు ప్రభుత్వం సన్నద్ధ ఐలు చేపట్టింది. ఇందులో భాగంగా భారతీయ రైతు సహకార సంస్థ(ఇఫ్కో) అభివృద్ధి చేసిన నానో యూరియా(ద్రవరూపం) దేశ వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పునకు శ్రీకారం చుట్టింది. సంప్రదాయానికి ప్రత్యామ్నాయంగా నానో యూరియాను ప్రవేశపెట్టడం ద్వారా రైతుల ఖర్చులను తగ్గించి, పంట దిగుబడులను పెంచడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుంది.

500 మిల్లీ లీటర్ల నానో యూరియా డబ్బా 45 కిలోల సంప్రదాయ యూరియా బస్తాకు సమానం.. ఇది మొక్కలకు నత్రజనిని మరింత సమర్థంగా అందిస్తుంది. తద్వారా యూరియా వినియోగాన్ని గణనీయంగా తగ్గిస్తుంది. నానో యూరియా వాడకంతో పంట దిగుబడులు 8 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది.. ఇది మొక్కల కిరణ జన్య సంయోగ క్రియను మెరుగుపరుస్తుంది. వేరు వ్యవస్థను బలోపేతం చేస్తుంది.

సంప్రదాయ యూరియా బస్తా ధరతో పోలిస్తే నానో యూరియా బాటిల్ తక్కువ ధరకే లభిస్తుంది. యూరియా బస్తా 45 కిలోలు ధర రూ.266గా ఉంది. అదే నానో యూరియా 500 మి.లీ బాటిల్ ధర రూ.255 మాత్రమే.. దీంతో పాటు రైతులపై ఆర్థిక భారం తగ్గుతుంది. రవాణా, నిల్వ ఖర్చులు కూడా తగ్గుతాయి.

నానో యూరియా నేల, గాలి, నీటి కాలుష్యాన్ని తగ్గిస్తుంది. యూరియా నేలలోకి ఇంకిపోవడం, వాయువులుగా మారడంతో కలిగే నష్టాలను నివారించడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని తగ్గిస్తుంది. నానో యూరియాను నీటిలో కలిపి ఆకులపై పిచికారీ చేయవచ్చు. రైతులు సులభంగా ఉపయోగించవచ్చు, శ్రమను కూడా తగ్గిస్తుంది.

వినియోగించే విధానం..

నానో యూరియాను పంట పూత దశకు ముందు లేదా విత్తిన 20 రోజుల తర్వాత రెండు సార్లు పిచికారీ చేయాలి. 20-25 లీటర్ల నీటికి 75 నుంచి 100 ఎంఎల్ నానో యూరియాను కలిపి పిచికారీ చేయాలి. రైతు కొనుగోలు చేసి సులభంగా ఇంటికి తీసుకురావచ్చు.



ఎరువుల దుకాణంలో నానో యూరియా

అవగాహన కల్పిస్తున్నాం..



నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. కరపత్రాలు, గోడపత్రికల ద్వారా, వాట్సాప్ గ్రూపుల ద్వారా సమాచారం అందిస్తున్నాం. నానో యూరియా వాడటంతో రైతులకు ఆర్థికంగా లాభదాయకంగా ఉండటమే కాకుండా, స్థిరమైన, పర్యావరణ హితమైనది. రైతులు సద్వినియోగం చేసుకొని అధిక దిగుబడి పొందాలి.

- సంజీవ్, మండల వ్యవసాయ అధికారి, తంగళ్లపల్లి

రాజన్న ఆలయ అభివృద్ధికి విరాళం

వేములవాడ, న్యూస్‌టుడే : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి మంచిర్యాల జిల్లా జన్నారం మండలానికి చెందిన గుండ శ్రీనివాస్ ఆదివారం రూ.25,116 విరాళం అందజేశారు. కొండగట్టుకు చెందిన నడిగొట్టు శకుంతల-లక్ష్మణ్ దంపతులు రూ.10,116లు ఇచ్చారు. ఈ మేరకు భక్తులకు ప్రొటోకాల్ కార్యాలయంలో పీఆర్వో శ్రీనివాస్ రసీదు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ సహాయకుడు దిలీప్, సిబ్బంది పాల్గొన్నారు.



భక్తులకు రసీదు అందజేస్తున్న ప్రొటోకాల్ అధికారి శ్రీనివాస్

ఉద్యమకారుల జేఏసీ ఛైర్మన్ ఎన్నిక



గజ్జెల దేవరాజును సత్కరిస్తున్న నాయకులు

సిరిసిల్ల(విద్యానగర్), న్యూస్‌టుడే : జిల్లా ఉద్యమకారుల సంఘాల జేఏసీ ఛైర్మన్‌గా గజ్జెల దేవరాజు ఆదివారం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియ వేగవంతంగా జరగాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు హామీ ఇచ్చిన విధంగా 250 గజాల భూమి, అందరికీ పింఛను అందించాలన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు బుస్స వేణు, రాచర్ల వెంకన్న, లక్ష్మి, పద్మ పాల్గొన్నారు.

భాజపా పట్టణ ప్రధాన కార్యదర్శిగా..

సిరిసిల్ల(విద్యానగర్) : భాజపా సిరిసిల్ల పట్టణ ప్రధాన కార్యదర్శిగా సిద్ధి దేవరాజు నియామకమయ్యారు. జిల్లా కేంద్రంలోని భాజపా కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ సిద్ధి దేవరాజుకు నియామక పత్రం అందజేశారు. పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

అనుమానాస్పద స్థితిలో బిల్ కలెక్టర్ మృతి

ఎల్లారెడ్డిపేట(వీర్నపల్లి), న్యూస్‌టుడే : అనుమానాస్పద స్థితిలో బిల్ కలెక్టర్ మృతి చెందిన ఘటన ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. మండల కేంద్రంలో నివాసం ఉంటున్న గాదం నవీన్(40) ముస్తాబాద్ మండలం గోపాల్‌పల్లిలో బిల్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. రాఖీ పండగ సందర్భంగా భార్య కుమారుడిని తీసుకొని పుట్టింటికి వెళ్లింది. ఒంటరిగా ఉన్న నవీన్ ఇంట్లో నుంచి బయటకు రాకపోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉన్నాడు. భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ వివరించారు. పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించినట్లు తెలిపారు.



నవీన్

లారీ ఢీకొని వాహనదారుడికి గాయాలు

ముస్తాబాద్, న్యూస్‌టుడే : లారీ ఢీకొన్న ఘటనలో ద్విచక్రవాహనదారుడికి గాయాలైన ఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మండల కేంద్రానికి చెందిన దబ్బెడ రాములు ఆదివారం మండల కేంద్రంలోని వారసంతకు వెళ్లారు. కూరగాయలు తీసుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తున్న క్రమంలో దుబ్బాక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో రాములు కింద పడగా చేతికి, కాలుకు గాయాలయ్యాయి. స్థానికులు సమీపంలోని ఓ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

దాడి చేసిన పలువురిపై కేసు

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే : పెళ్లి మండపం వద్దకు వచ్చి గొడవకు దిగి ఓ యువకుడిపై దాడి చేసిన పలువురిపై సిరిసిల్ల పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. బీవైనగర్‌కు చెందిన కస్తూరి శ్రవణ్‌కుమార్‌కు మూడేళ్ల క్రితం గోదావరిఖనికి చెందిన ఓ యువతితో వివాహం జరిగింది. కొంతకాలానికి దంపతుల మధ్య విభేదాలు తలెత్తగా శ్రవణ్‌తో పాటు అతని కుటుంబ సభ్యులపై అదనపు కట్నం, వేధింపుల కేసు నమోదైంది. ప్రస్తుతం ఈ వివాదం కోర్టులో ఉంది. ఇదిలా ఉండగా శ్రవణ్‌కుమర్ చెల్లెలు వివాహం ఆదివారం సిరిసిల్లలోని ఓ ఫంక్షన్ హాల్లో జరుగుతుండగా విషయం తెలుసుకున్న యువతి బంధువులు దాదాపు 20 మంది అక్కడికి వచ్చారు. పెళ్లి మండపంలోనే శ్రావణ్‌తో పాటు బంధువులను దూషిస్తూ దాడికి పాల్పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని బాధితుడిని రక్షించారు. దాడికి పాల్పడిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ శ్రీనివాస్ తెలిపారు.

ధర్మపురి, న్యూస్‌టుడే: గోదావరి పుష్కరాలకు సంబంధించిన అభివృద్ధి పనులు త్వరలోనే ప్రారంభిస్తామని, ప్రస్తుతం టెండర్ల దశలో ఉన్నాయని రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు స్పష్టం చేశారు. శనివారం ధర్మపురిలోని దేవాలయ కార్యాలయంలో 'న్యూస్‌టుడే'తో ఆయన పుష్కరాల పనులపై మాట్లాడారు.

రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు

సెప్టెంబరులో ముమ్మరంగా పుష్కర పనులు



ప్రశ్న : పుష్కరాలకు సంబంధించి నిధులు, పనుల పరిస్థితేంటి.

సమాధానం : గోదావరి పుష్కరాల అభివృద్ధి పనులకు పూర్తి స్థాయిలో అనుమతులు వచ్చాయి. ధర్మపురి, భద్రాచలం, బాసర వంటి పుణ్యక్షేత్రాలతో పాటు, గోదావరి తీర ఆలయాల వద్ద మౌలిక వసతుల కల్పనకు రూ.1000 కోట్లు మంజూరయ్యాయి. సెప్టెంబరు మొదటి వారంలో అన్ని పుష్కరక్షేత్రాల్లో పనులు ముమ్మరంగా చేపడతాం. ప్రస్తుతం టెండర్ల దశలో ఉన్నాయి.

ప్ర : ఆలయాల వారీగా కేటాయించిన నిధులు

స: ధర్మపురి, కోటిలింగాలకు రూ.117 కోట్లు కేటాయించారు. వీటిలో దేవాదాయశాఖ ద్వారా మంజూరైనా రూ.10 కోట్లతో ఉగ్ర స్వామి ఆలయం జీర్ణోద్ధరణ పనులు చేపడుతున్నాం. రెండో విడతలో ఇరిగేషన్ ఆధ్వర్యంలో పుష్కరఘాట్లు, ఆర్అండ్‌బీ శాఖ ద్వారా రహదారులు, బైపాస్‌రోడ్లు నిర్మించనున్నాం. గత పుష్కరాల సందర్భంగా ధర్మపురికి 50 లక్షలకు పైగా హాజరు కాగా.. ఇప్పుడు కోటికి పైగానే హాజరవుతారని భావిస్తు ఏర్పాట్లు చేపడుతున్నాం. మొదటి విడతలో రూ.100 కోట్లు విడుదల కాగా.. తీర ప్రాంత, ఆలయాల అభివృద్ధికి ఉపయోగిస్తాం.

ప్ర : ఘాట్ల వద్ద తొక్కిసలాట, ట్రాఫిక్ సమస్యలు లేకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటారు.

స : ఏఐ ఆధారిత సీసీటీవీలతో రద్దీని ఎప్పటికప్పుడు లెక్కిస్తూ గరిష్ఠ పరిమితి మించకుండా విడతల వారీగా స్నానాలు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. బైపాస్ రహదార్ల నిర్మాణంతో ఒకవైపు నుంచి భక్తులు లోనికి రావడం, మరో రోడ్డు నుంచి వెళ్లిపోవడం జరుగుతుంది. ఇలా శాస్త్రీయ దృక్పథంతో సర్వే చేయించి చర్యలు తీసుకుంటాం.

ప్ర: నదీ జలాలు కాలుష్యం కాకుండా ఏం చేస్తారు.

స : యువకులు, స్వచ్ఛంద సంస్థలు, వాలంటీర్లతో ఎప్పటికప్పుడు నీటిశుద్ధి వ్యవస్థలపై సర్వే చేయిస్తూ పారిశుద్ధ్య సిబ్బందిని షిప్టుల వారీగా నిరంతరం శుభ్రంగా ఉంచేలా, చెత్త రహిత కేంద్రాలుగా తీర్చిదిద్దనున్నాం. ప్రైవేట్ సంస్థలతో ఇప్పటికే దీనిపై ప్రధాన క్షేత్రాల్లో సర్వే చేపట్టాం. నది కలుషితం కాకుండా మైకుల ద్వారా భక్తులను చైతన్యం చేస్తాం.

ప్ర : డిజిటల్ టెక్నాలజీని ఏ విధంగా ఉపయోగించనున్నారు.

స : ప్రత్యేక పుష్కర మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నాం. దీని ద్వారా ఘాట్ల వద్ద రద్దీ, తాజా పరిస్థితి, పార్కింగ్ స్థలాలు, సమీప క్యాంపులు, వసతి గృహాల లభ్యత, పూజ సమయాల సమాచారాన్ని నేరుగా ప్రజలు తెలుసుకునేలా చర్యలు తీసుకుంటాం. యాప్‌కు ఇంకా తుది రూప రాలేదు.

రెడ్డి సంఘం నూతన కార్యవర్గం

ఇల్లంతకుంట, న్యూస్‌టుడే : ఇల్లంతకుంట మండల రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. సంఘం అధ్యక్షుడిగా ఉమ్మంతుల మహిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గడ్డం రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా చిలువేరి సంతోష్‌రెడ్డి, పారుపల్లి దేవేందర్‌రెడ్డి, భూంపెల్లి రవీందర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా కంది శ్రీనివాస్‌రెడ్డి, కేతిరెడ్డి సత్యనారాయణరెడ్డి, మల్లారెడ్డి, సత్యనారాయణరెడ్డి, కోశాధికారిగా అయ్యన్నగారి హరికృష్ణారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా పండగ ఎల్లారెడ్డి, బోద కమలాకర్‌రెడ్డి, సంజీవరెడ్డి, రవీందర్ రెడ్డి, సురేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ తన వంతు సాయంగా సంఘ భవనానికి రూ.10 లక్షల విరాళం అందజేస్తున్నట్లు ప్రకటించారు.



మహిపాల్‌రెడ్డి

పెంటకుప్పలు తొలగించాలని నిరసన

వీర్నపల్లి, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని పీరీల మసీదు ప్రాంతంలో పెంటకుప్పలతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని కాలనీవాసులు ఆదివారం నిరసన తెలిపారు. సమీపంలో బోరుబావుల్లో నీరు కలుషితమవుతోందని వాపోయారు. నీటిని తాగిన జనాలకు అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. అలాగే కాలనీకి చేరుకునే రోడ్డులో సుమారు 50కి పైగా స్పీడ్ బ్రేకర్లు ఉన్నాయని, గుంతలు, వేగ నిరోధకాలతో వాహనాలు చెడిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా సమస్యలపై పంచాయతీ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు.

నిర్వాసితులకు న్యాయం చేయండి

తంగళ్లపల్లి, న్యూస్‌టుడే : మండలంలోని మండేపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 377లో భూములు కోల్పోయిన సుమారు 200 కుటుంబాలకు న్యాయం చేయాలని సీపీఐ జిల్లా నాయకుడు వేణు డిమాండ్ చేశారు. ఆదివారం తంగళ్లపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బాధితులకు ఎకరానికి రూ.20 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని కోరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో సుమారు 350 ఎకరాలను పేదలకు జీవనోపాధి కోసం కేటాయించారని, లబ్ధిదారుల్లో అధిక శాతం దళిత కుటుంబాలేనని తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆయా భూములను భారాస ప్రభుత్వం స్వాధీనం చేసుకొని, ప్రభుత్వ అవసరాలకు వినియోగించుకుంటూ నష్టపరిహారం ఇవ్వలేదని అన్నారు. సమావేశంలో నాగరాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా నేత వేణు

సంక్షిప్తం

■ సంఘాలు-నియామకాలు

నిజామాబాద్(కోనరావుపేట), న్యూస్‌టుడే : కోనరావుపేట మండల గౌడ యువజన సంఘం నూతన కమిటీని ఆదివారం రాష్ట్ర అధ్యక్షుడు గట్టు నరేశ్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు అబ్బసాని సందీప్‌గౌడ్ ఆధ్వర్యంలో నియమించారు. మండల అధ్యక్షుడిగా గొల్లపల్లి సాయి కుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా సింగం నరేందర్ గౌడ్, ఉపాధ్యక్షులుగా ఏగోలపు ప్రవీణ్‌గౌడ్, జాగిరి కిరణ్‌గౌడ్, కార్యదర్శులుగా తీగల భరత్‌గౌడ్, గొల్లపల్లి ప్రమోద్‌గౌడ్ నియమితులయ్యారు.

బోయినపల్లి : ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ మండల కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొంకటి రమేష్, అధికార ప్రతినిధిగా దోమకొండ భూమయ్య, ఉపాధ్యక్షులుగా కన్నం రాజయ్య, రాగటి నారాయణ, కల్లేపల్లి శంకర్, ప్రధాన కార్యదర్శిగా పెగ్గర్ల శేఖర్, సోషల్ మీడియా కన్వీనర్‌గా కత్తెరపాక మనోహర్, ఎంఎస్‌పీ అధ్యక్షుడిగా రోమాల రాజు, అధికార ప్రతినిధిగా మల్లారపు ప్రసాద్ ఎన్నికయ్యారు.

■ రాష్ట్రపతి రక్షా బంధన్ వేడుకలో మరిమడ్ల విద్యార్థి

మరిమడ్ల (కోనరావుపేట) : కోనరావుపేట మండలం మరిమడ్ల ఏకలవ్య మాడల్ రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థి కె.శివ, సంగీత ఉపాధ్యాయుడు తరుణ్‌కుమార్ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నిర్వహించిన రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొన్నట్లు ప్రిన్సిపల్ ఆర్.ఎస్.యాదవ్ ఆదివారం తెలిపారు. రాష్ట్రంలోని 23 ఈఎంఆర్ఎస్ పాఠశాలల నుంచి 20 మంది విద్యార్థులు పాల్గొని రాష్ట్రపతికి రాఖీ కట్టడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థిని, సంగీత ఉపాధ్యాయుడిని పలువురు అభినందించారు.

■ ఆలయంలో సీసీ కెమెరా ఏర్పాటు

కోరెం(బోయినపల్లి) : కోరెం కొండ పోచమ్మ ఆలయం వద్ద సీసీ కెమెరాను ఆదివారం ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన రోమాల నరేశ్-అశ్విని దంపతులు ఆలయానికి కెమెరాను వితరణ చేశారు. ఇక్కడి వచ్చే భక్తుల సౌలభ్యం కోసం అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు వెన్నల రమణారెడ్డి, ప్యాక్స్ డైరెక్టర్ మల్లారెడ్డి, పులి హన్మాండ్లు తదితరులు ఉన్నారు.

■ 1న ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ రాక

సిరిసిల్ల కలెక్టరేట్ : సెప్టెంబరు 1న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్, ఐదుగురు సభ్యులు జిల్లాలో పర్యటించనున్నారు. ఛైర్మన్ బక్కి వెంకటయ్య, సభ్యులు కుస్రం నీలాదేవి, రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, రేణికుంట్ల ప్రవీణ్ మంగళవారం ఉదయం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయానికి చేరుకుంటారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులతో ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్, సభ్యులు ఉదయం 11 గంటలకు సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు.

■ మృతుడి కుటుంబానికి పరామర్శ

వీర్నపల్లి : ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు చెందిన నన్నేసాబ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుమారుడు జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గౌస్, కోడలు సాబేరాబేగంను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదివారం పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, గ్రంథాలయ ఛైర్మన్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

■ పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం

వీర్నపల్లి : మండల కేంద్రానికి చెందిన దేశరాజు సత్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని వీర్నపల్లి ఉన్నత పాఠశాలలో 2011-12లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పరామర్శించారు. రూ.10 వేల నగదుతోపాటు 50 కిలోల బియ్యం, నిత్యావసర సరకులు వితరణ చేశారు. కార్యక్రమంలో విక్రమ్, శేఖర్, నవీన్, భాను, భాస్కర్ అఖిల్, మహేష్, రంజిత్ పాల్గొన్నారు.

■ 1న పల్లగుట్ట పరిరక్షణకు సమావేశం

ముస్తాబాద్ : ముస్తాబాద్ మండలం నామాపూర్ శివారులోని పల్లగుట్టను అనుమతుల పేరిట గుట్టుచప్పుడు కాకుండా తవ్వితే గూడూరు గ్రామస్థులు అడ్డుకున్న విషయం విధితమే.. పల్లగుట్టను పరిరక్షించేందుకు సెప్టెంబర్ 1న 11 గంటలకు రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి గుంటి వేణు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పల్లగుట్టను కొల్లగొడితే ఊరుకునేది లేదన్నారు. సమావేశానికి అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు.

1 నుంచి ఎస్‌జీఎఫ్ పోటీలు

కోనరావుపేట, న్యూస్‌టుడే : మండలంలోని సుద్దాల, కనగర్తి ఉన్నత పాఠశాలల క్రీడా మైదానంలో సెప్టెంబర్ 1, 2, 3 తేదీల్లో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ ఆటల పోటీలు మండల విద్యాధికారి మురళీనాయక్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి, సుద్దాల ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సంతోష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, 17, బాలురకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు అండర్-14, 17 బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాలబాలికలకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. క్రీడాకారులు స్టడీ ధ్రువీకరణ పత్రం తీసుకురావాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీర్నపల్లి, న్యూస్‌టుడే : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై రమేశ్ ఆదివారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ శివారులోని వాగులో ఇసుకను తోడుతున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా వాహనంలో ఇసుక నింపుతున్నట్లు గుర్తించి, ఇసుకతోపాటు ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని యజమాని శీతల నరేశ్, చోదకుడు కూడెల్లి రాజుపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.